క్లుప్తంగా

పనులు నాణ్యతగా చేపట్టండి



రికార్డును పరిశీలిస్తున్న మంత్రి బీసీ

పాణ్యం : ఆర్‌అండ్‌బీ పరిధిలో చేపట్టిన బ్రిడ్జిని నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. పాణ్యం సమీపంలోని వొద్దెలవాగుపై రూ.2 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నారు. శనివారం పనులను మంత్రి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాలు తీవ్రమయ్యే నాటికి బ్రిడ్జికి సంబంధించి మేజర్ పనులు పూర్తి చేయాలన్నారు. వాగులకు వరద ఉధృతి పెరిగితే పనులకు తీవ్ర ఆటంకంగా మారుతుందన్నారు. ప్రస్తుతం పనులు 50శాతం పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈఈ సుబ్బరాయుడు, ఏఈ వెంకటేశ్వరరెడ్డి, కాంట్రాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కులు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: ప్రతి పౌరుడు హక్కులను వినియోగించుకోవాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బలపనూరు సచివాలయంలో మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతిపౌరుడికి రాజ్యాంగం హక్కులు కల్పించిందన్నారు. పౌరుల హక్కులకు ఆటంకం కలిగితే న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చన్నారు. ప్రతి పౌరుడికి ఉచిత న్యాయసేవా హక్కుల పరిరక్షణకు అందుబాటులో కేంద్రాలు ఉన్నాయన్నారు. చౌకదుకాణాన్ని పరిశీలించారు. ఒకటో తేదీ ప్రజాపంపిణీ పండుగ వాతావరణంలో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాము పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



పదవీ విరమణ పొందిన రాజశేఖర్‌ను సన్మానిస్తున్న ఈఈ శివప్రసాద్

పాణ్యం: ఉత్తమ సేవలతో గుర్తింపు లభిస్తుందని ఎస్‌ఆర్‌బీసీ డివిజన్–2 ఈఈ శివప్రసాద్ అన్నారు. శనివారం డీఈఈ ఎల్ రాజశేఖర్ పదవీ విరమణ సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉత్తమ సేవలు అందించడంతోనే అధికారులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. విధి నిర్వహణలో అనేక ఒడిదుడుకులను అధికమించి లక్ష్యాలను చేరుకోగలమన్నారు. అనంతరం ఆయనను శాలువాలతో సన్మానించి వీడ్కోలు పలికారు.

సంక్షేమానికి పెద్దపీట



దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేసిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 27వ వార్డులో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివారం సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు.

వర్మీ కంపోస్టు తయారు చేయాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి

కల్లూరు : చెత్త సంపద కేంద్రాల (ఎస్‌డబ్ల్యూపీసీ) నుంచి వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేయాలని మండల ప్రత్యేక అధికారి (సెట్కూరు సీఈఓ) వేణుగోపాల్ సూచించారు. శనివారం పెద్దటేకూరు గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నాగేష్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జనానికి మోత.. ఆపరేటర్లకు వాత

- ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానికి మంగళం
- నేటి నుంచి రేషన్ దుకాణాల్లోనే పంపిణీ
- కార్డుదారులకు తప్పని పడిగాపులు
- అగమ్యగోచరంగా ఎండీయూ ఆపరేటర్ల పరిస్థితి
- కూటమి ప్రభుత్వంపై సర్వత్రా విమర్శలు



ఎండీయూ వాహనం ద్వారా రేషన్ తీసుకుంటున్న కార్డుదారులు (ఫైల్)



కోడుమూరులో రేషన్ దుకాణం ముందు కార్డుదారుల క్యూలైన్ (ఫైల్)

కోడుమూరు రూరల్: ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఇంటి ముంగిటకే వాహనాల ద్వారా నిత్యావసర వస్తువులను అందజేసింది. తద్వారా ప్రజలు బియ్యం తదితర నిత్యావసర వస్తువుల కోసం రేషన్ దుకాణాల ముందు క్యూలైన్‌లో నిలబడాల్సిన పని ఉండేది కాదు. ఎంచక్కా తమ ఇంటి ముంగిటకే వచ్చిన వాహనంలో కార్డుదారులు బియ్యాన్ని తీసుకునేవారు. దీనివల్ల కార్డుదారులకు వ్యయప్రయాసాలుండేవి కాదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇంటింటి బియ్యం పంపిణీ వ్యవస్థకు మంగళం పాడింది. దీనివల్ల కార్డుదారులు మళ్లీ రేషన్ సరుకుల కోసం దుకాణాల ముందు క్యూలైన్‌లో నిలబడాల్సిన దుస్థితి దాపురించింది.

ఆ గ్రామాల్లో రేషన్ దుకాణాల్లేవ్

కోడుమూరు మండలంలోని బైస్‌దొడ్డి గ్రామంలో 400 మందికిపై జనాభా ఉండగా, 80కు పైగా రేషన్ కార్డులున్నాయి. అయితే గ్రామంలో రేషన్ దుకాణం లేదు. 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న కల్లపరి గ్రామానికి వెళ్లి డీలర్ వద్ద రేషన్ సరుకులు తీసుకోవాల్సి ఉంది. అలాగే సి.బెళగల్ మండలం బ్యాతోలి గ్రామంలో 700కు పైగా జనాభా ఉండగా, 186 కార్డుదారులున్నాయి. రేషన్ దుకాణం లేకపోవడంతో 3 కి.మీ దూరంలో ఉన్న బురాన్‌దొడ్డికి వెళ్లి రేషన్ సరుకులను తీసుకోవాల్సి ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బియ్యం పంపిణీ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందించేది. దీంతో ఆయా గ్రామస్తులు రేషన్ బియ్యాన్ని తమ ఇంటి వద్దనే తీసుకునేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బియ్యం పంపిణీ వాహనాలకు మంగళం పాడడంతో తాము పనులు మానుకుని మళ్లీ ఇతర గ్రామాలకు వెళ్లి రేషన్ సరుకులను తెచ్చుకోవాల్సిన దుస్థితి దాపురించిందని ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

జిల్లాలో 409 ఎండీయూ వాహనాలు నిలిపివేత

కూటమి ప్రభుత్వం జూన్ 1వ తేదీ నుంచి కార్డుదారులే డీలర్ వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలని నిబంధన విధిస్తూ ఎండీయూ వాహనాలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని కోడుమూరు, కర్నూలు, ఆలూరు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ మంత్రాలయం నియోజకవర్గాల్లో ఉన్న 409 ఎండీయూ వాహనాల సేవలు నిలిచిపోయాయి.

ఎండీయూ ఆపరేటర్లతో ప్రభుత్వం చెలగాటం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ కోసం తెచ్చిన వాహనాలను నిలిపేయడంతో ఆ వాహనాలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఎండీయూ వాహనదారులు, వారి సహాయకులు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. తమను జగనన్న ప్రభుత్వం 2027 వరకు కొనసాగిస్తూ జీఓ ఇస్తే, కూటమి ప్రభుత్వం ఉన్న ఫలంగా తమను తొలగిస్తూ నిర్ణయం తీసుకోవడం దారుణమని వాపోయారు. తమకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామంటూ హెచ్చరిస్తున్నారు.

వాహనాలను నిలిపేయడం దారుణం

ఎండీయూ వాహనాలను నిలిపేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణం. చదువుకున్నప్పటికీ ఉద్యోగం లేక ఎండీయూ వాహన డ్రైవర్‌గా ఉంటూ ఉపాధి పొందుతున్నా. వాహనాలను రద్దు చేస్తే మేము ఏమైపోవాలి. మా కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం స్పందించి మాకు న్యాయం చేయాలి.

–నవీన్‌రాజు, ఎండీయూ వాహనదారుడు, కర్నూలు

మళ్లీ కష్టాలు మొదలవుతున్నాయి



మా గ్రామంలో రేషన్ దుకాణం లేదు. బియ్యం కావాలంటే 5 కి.మీ దూరంలోని కల్లపరి గ్రామానికి వెళ్లి తెచ్చుకోవాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బియ్యం పంపిణీ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందించడంతో మా కష్టాలు తొలగాయి. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ వాహనాలను నిలిపేయడంతో మళ్లీ మాకు మోత కష్టాలు మొదలయ్యాయి. బియ్యం కావాలంటే ఆటోలు, బండ్లపై వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

–నరసింహ, బైస్‌దొడ్డి గ్రామం, కోడుమూరు

మాకు ప్రత్యామ్నాయం చూపాలి



కోడుమూరులో బియ్యం పంపిణీ వాహన డ్రైవర్‌గా పనిచేస్తూ నాలుగేళ్ల నుంచి ఉపాధి పొందుతున్నా. ఉన్న ఫలంగా కూటమి ప్రభుత్వం వాహన వ్యవస్థను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడం దారుణం. ఇన్నాళ్లు బియ్యం పంపిణీ వాహనాలకు కంతులు సైతం కట్టుకున్నాం. బియ్యం పంపిణీని రద్దు చేస్తే వాహనాలను ఏమి చేయాలి, వాహనాల కోసం కట్టిన డబ్బుల పరిస్థితి ఏమిటన్నది ప్రభుత్వమే తేల్చాలి. మాకు ప్రత్యామ్నాయం చూసిన తర్వాతనే వాహనాలను రద్దు చేయాలి.

–నాగభూషణం రెడ్డి, ఎండీయూ వాహనదారుడు, కోడుమూరు

ప్రయాణికుల అవస్థలు తీరేనా?



మరుగుదొడ్ల నిర్మాణానికి తీసిన గుంత



పాత షెల్టర్‌కు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రయాణికులకు తాగునీరు, మహిళా ప్రయాణికులకు మరుదొడ్లు లేకపోవడంతో వారిది చెప్పుకోలేని వ్యథ. సాక్షాత్తు కలెక్టర్ ఆదేశించినా పనులు పూర్తి చేయకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సౌకర్యాలు కల్పించాలని ఉద్యమాలు..

పాణ్యం ఆర్టీసీ బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రయాణికులు, పాణ్యం ప్రజలు, ప్రజాసంఘ నాయకులు అనేక ఉద్యమాలు చేశారు. చివరికి పనులు చేపట్టేందుకు అధికారులు ముందుకొచ్చారు. ఈ నెల 7వ తేదీన స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు కూడా నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. అంతేకాక అధ్వానంగా ఉన్న బస్‌షెల్టర్‌ను శుభ్రం చేసి నిర్మాణాల కోసం హడావిడి చేసి గుంతలు తవ్వి వదిలేశారు. దాదాపుగా పదిరోజులైనా ఎలాంటి నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు. సాక్షాత్తు కలెక్టర్ సందర్శించి, త్వరగా పూర్తి ఆదేశించినా పనులు జరగకపోవడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ప్రయాణికులకు తాగునీరు, మరుగుదొడ్ల సమస్య తీరేలా లేదని చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై నంద్యాల ఆర్టీసీ డీఎం గంగధార్‌ను సంప్రదించగా.. వర్షాల కారణంగా పనులు నిలిపేసినట్లు తెలిపారు.

నేడు 'వెన్నుపోటు' పోస్టర్ల ఆవిష్కరణ

కోడుమూరు రూరల్: సీఎం చంద్రబాబునాయుడు మోసాలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జూన్ 4న నిర్వహించ తలపెట్టిన వెన్నుపోటు దినం పోస్టర్లను ఆదివారం కోడుమూరులో ఆవిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్‌నాయుడు తెలిపారు. కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న శ్రీ కోనావేంకటేశ్వరస్వామి

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వెంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూదేవి, అలివేలిమంగమ్మ సమేత కోనావెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించారు. తర్వాత అర్చకులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక గ్రామస్తులతో పాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పింఛన్ల పంపిణీ తనిఖీ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీడీ

సి.బెళగల్: మండలంలో శనివారం పింఛన్ల పంపిణీని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మత్స్యశాఖ డీడీ రంగనాథబాబు తనిఖీ చేశారు. మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో పంపిణీ సరళిని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి, పింఛన్లు అందుతున్నాయా అని ఆరా తీశారు. కాగా పలు గ్రామాల్లో ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లకుండా సచివాలయాలు, వీధులు, అరుగుల వద్ద పంపిణీ చేశారు. మండలంలో 7,040 మంది లబ్ధిదారులు ఉండగా, 6,469 మందికి పింఛన్ 92 శాతం పంపిణీ నమోదైంది.

దైవారాధనతో మానసిక ప్రశాంతత



మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

గడివేములు: ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, ఇష్ట దైవాన్ని స్మరించుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో శనివారం శివాలయం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శ్రీకృష్ణ విగ్రహ, . ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే హాజరయ్యారు. స్వామి వార్ల విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ప్రతిష్ఠ కార్యక్రమాల అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పని ఒత్తిడి ప్రభావం వల్ల మనశ్శాంతిని కోల్పోతున్నారన్నారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేయడం, తమ ఇష్ట దైవాన్ని ఆరాధించడం ద్వారా మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కులమతాలకు అతీతంగా ఐకమత్యంగా అందరు కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేయడం మంచి పరిణామమన్నారు. అనంతరం గని గ్రామంలో జరిగిన ఓ శుభకార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, వైస్ ఎంపీపీ కాలునాయక్, పాణ్యం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మధుసూదన, ఎంపీటీసీ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లయ్య, దాలుస్వామి, ఎల్లారెడ్డి, అనంద్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, మేఘనాథరెడ్డి, గని ప్రతాప్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి కంప్యూటర్ విద్య అవసరం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డైరెక్టర్లు

కోడుమూరు రూరల్: ప్రస్తుత సమాజంలో ప్రతి విద్యార్థికి కంప్యూటర్ విద్య ఎంతో అవసరమని భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. వేసవి సెలవుల సందర్భంగా స్థానిక నాగార్జున విద్యానిలయంలో నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న 220 మంది విద్యార్థులకు శనివారం యాజమాన్యం సర్టిఫికెట్లను అందజేసింది. ముఖ్య అతిథిగా ఎద్దుల మహేశ్వరరెడ్డి హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులకు నెల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు నాగార్జున యాదవ్, ఎద్దుల సూర్యరెడ్డి పాల్గొన్నారు.

సమా'వేషా'లెందుకు..?

- కౌన్సిల్ సమావేశంలో నిలదీసిన సభ్యులు
- అధికారుల తీరుపై అసహనం



సమావేశంలో ప్రజాసమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

కోడుమూరు రూరల్: గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం నిర్వహించిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్, కౌన్సిలర్లు మాట్లాడుతూ.. నగర పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు ఎక్కడా జరగడం లేదని, గత సమావేశాల్లో నిర్ణయించిన అభివృద్ధి పనుల పురోగతిలో ఇంతవరకు అతీగతీ లేదన్నారు. సమస్యలను పరిష్కరించలేనప్పుడు సమావేశాలెందుకు నిర్వహిస్తున్నారంటూ మండిపడ్డారు. నగర పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో తాము ప్రజల్లో తిరగలేకపోతున్నామంటూ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. గూడూరులో అన్న క్యాంటిన్ ఏర్పాటుకు ప్రభుత్వం గతంలోనే నిధులు విడుదల చేసిందని, అయితే మరమ్మతుల పేరుతో నగర పంచాయతీ జనరల్ నిధులు రూ.5లక్షల మంజూరుకు ఎలా ప్రతిపాదనలు పంపుతారని, గత సమావేశంలో తిరస్కరించినా మళ్లీ మళ్లీ ప్రతిపాదనలు పెట్టడంలో ఆంతర్యమేమిటని, సమాధానం చెప్పాలంటూ వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్ కమిషనర్ రమేష్‌బాబును ప్రశ్నించారు. ఏఈ అందుబాటులో లేడంటూ కమిషనర్ సమాధానం చెప్పకుండా దాటవేశారు. అనంతరం సభలో అధికారులు ప్రవేశపెట్టిన 35 ప్రతిపాదనల్లో 25 ప్రతిపాదనలను కౌన్సిలర్లు తిరస్కరించగా, పదింటిని మాత్రమే ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్ లక్ష్మన్న, కౌన్సిలర్లు దస్తగిరి, ఖలీల్, రత్నమ్మ, మల్లీశ్వరి, ఉరుకుందమ్మ, మానస, జ్యోతి, కోఆప్షన్ మెంబర్ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అనేక ప్రయోజనాలు



కంబదహాల్లో రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త రాఘవేంద్ర

సి.బెళగల్: రైతులు పంటల సాగుకు ముందు విత్తనశుద్ధి చేయాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాఘవేంద్ర అన్నారు. శనివారం సి.బెళగల్ మండలంలోని కంబదహాల్ రైతు సేవా కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రాఘవేంద్ర, శివకృష్ణ, కర్నూలు ఏడీఏ సాలురెడ్డి హాజరయ్యారు. శాస్త్రవేత్త రాఘవేంద్ర మాట్లాడుతూ.. విత్తనశుద్ధి అనంతరం విత్తనాలను సాలుకు మధ్య మూడు అడుగులు, మొక్కకు మధ్య అడుగు దూరంలో నాటుకోవాలని సూచించారు. కంది పంటలో స్వల్పకాలిక, దీర్ఘకాలిక విత్తనాలను వివరించారు. అదే విధంగా పత్తి, మిరప, ఉల్లి పంటల సస్యరక్షణ పద్ధతులను తెలియజేశారు. అనంతరం గ్రామ శివారులో రైతులు ముందుగా విత్తుకున్న పంటలను పరిశీలించారు. రైతులకు పీఎండీఎస్ కిట్‌ను అందజేశారు. ఏడీఏ సాలురెడ్డి పంటల్లో అంతర పంటలు, పంట సాగులో పెట్టుబడి ఆదా, బహుల విత్తన సాగు లాభాల అంశాలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో డీఆర్సీ ఏడీఏ గిరీష్, వీహెచ్‌ఏ శశిదేవి, మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగికి సన్మానం



ఉద్యోగిని సన్మానిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్, వీఆర్వోలు

సి.బెళగల్: తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తూ శనివారం పదవీ విరమణ పొందిన ఆఫీస్ సబార్డినేట్ రంగన్నను ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం, మండల రెవెన్యూ అధికారులు సన్మానించారు. శాలువా, పూలమాలలు వేసి జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ ఆదినారాయణ, ఆర్‌ఎస్ డీటీ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ తరుణ్, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఆర్.కొంతలపాడు గ్రామంలో సామాజిక పింఛన్ల పంపిణీని శనివారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. జూన్ 1వ తేదీ ఆదివారం రావడంతో ఒక్క రోజు ముందుగా పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీడీఓ రఘునాథ్, సర్పంచ్ మహానంది పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 114 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు శనివారం 114 మంది గైర్హాజరయ్యారు. 2వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 817 మందికి 718 మంది హాజరు కాగా 99 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 101 మందికి 86 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో సాయి శ్రీ డిగ్రీ కళాశాల విద్యార్థి ఒకరు చూచిరాతకు పాల్పడగా డిబార్ చేసినట్లు వెల్లడించారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



పదవీ విరమణ పొందిన వాచ్‌మెన్‌ను మేళతాళాలతో తీసుకెళ్తున్న దృశ్యం

గడివేములు: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న మానిపాటి సుంకన్న శనివారం పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుంకన్న 35 ఏళ్ల కాలంలో మచ్చలేని మనిషిగా పేరు తెచ్చుకున్నారన్నారు. శేష జీవితమంతా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయనతో పాటు భార్యను ఘనంగా సన్మానించి మేళతాళాలతో ఇంటి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మధు, ఆర్‌ఐ ఎల్లాసుబ్బయ్య, వీఆర్వోలు ప్రసాద్‌నాయుడు, కిట్టు, అనిల్‌కుమార్‌రెడ్డి, సామన్న, హరీంద్ర, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.